క్లుప్తంగా

త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం

పాములపాడు: మండల కేంద్రంలో పెద్దబావి నుంచి ఆర్‌అండ్ బీ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని డీఈ ధనబాబు తెలిపారు. బుధవారం కాలనీని పరిశీలించారు. దాదాపు 115 మీటర్ల మేర పొడవున త్వరలో నిర్మాణం పనులు ప్రారంభిస్తామని వివరించారు. అలాగే నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయిన ముస్లిం మైనార్టీ శ్మశాన వాటిక ప్రహరీని పరిశీలించారు. ఆయన వెంట జేఈ రాఘవేంద్రప్రసాద్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

నందికొట్కూరు రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మహిళా రైతులు పార్వతి, బ్యూలా సాగుచేసిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను తినడం వల్ల ఆరోగ్యంతో పాటు భూమి కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఇకనుంచి మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఎం నరేంద్రరెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ దేగలయ్య, ఏపీఎం మధు తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



కర్నూలు ఆసుపత్రిలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వెంకటనాయుడు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బుధవారం నూతన పింఛన్లను వైస్ ఎంపీపీ కట్టా మంజుల బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదల ముంగిటకే మెరుగైన సేవలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత

అల్లూరు గ్రామానికి చెందిన టీ. మద్దమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో గ్రామానికి చెందిన వలంటీర్ వెంకటనాయుడు, సచివాలయ కన్వీనర్ చెన్నరాయుడుతో కలిసి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఆమెకు ఫించన్ అందజేశారు.

12న కొలనుభారతిలో దుకాణాల వేలం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ సమీపంలో వెలసిన కొలనుభారతిదేవి ఆలయంలో అంగళ్ల నిర్వహణ కోసం ఈనెల 12న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్ బుధవారం తెలిపారు. ఆలయంలో హోటల్, గాజుల అంగడి, బొమ్మల అంగడి, కూల్‌డ్రింక్స్, ఐస్, బెల్లం చెరుకులు, కలింగర పండ్లు, అమ్మవారి ఫొటోలు అమ్ముకొనుటకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు దేవస్థానంలో రూ.2వేలు డిపాజిట్లు చెల్లించాలని తెలిపారు. వేలం దక్కించుకున్న వారు 2024 వసంత పంచమికి 5 రోజుల ముందు నుంచి 2025 వసంత పంచమికి 5 రోజుల ముందువరకు అంగళ్లు నిర్వహించుకునేందుకు అనుమతి ఉంటుందని వివరించారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు 12న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

కామాంధుడిపై కేసు నమోదు

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడు బంగ్లా గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన సామాధి అనే 58 ఏళ్ల కామాంధుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతిశంకర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం బాలిక తోటి పిల్లలో ఆడుకొంటుండగా సామాధి చాక్లెట్లు ఇస్తానని మాయమాటలు చెప్పి సమీపంలోని ఓ ఇంటి బాత్‌రూంలోకి తీసుకెళ్లాడు. ఆమెను కొరకడంతో కేకలు వేసింది. దీంతో తల్లితో పాటు చుట్టుపక్కల వారు వెళ్లి కామాధుడికి దేహశుద్ధి చేశారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఫారంపాండ్‌లు తవ్వుకునేలా చూడండి


కొత్తపల్లి: గ్రామాల్లోని రైతులు వారి పొలాల్లో ఫారంపాండ్‌లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రేష్మ సూచించారు. బుధవారం సిబ్బందితో స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ సంబంధిత గ్రామాలలో 50 వరకు రైతులు ఫారంపాండ్లు తీసుకునేలా పనిచేయాలన్నారు. రైతులకు వీటిని తీసుకోవడం వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని వివరించారు. గ్రామాలలోని చెరువులలో అమృత సరోవర్ కార్యక్రమంలో భాగంగా పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

మూడు రోజుల బైబిల్ శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో మూడు రోజుల చిన్నపిల్లలకు బైబిల్ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు సంఘకాపరి బి.దేవ సహాయం బుధవారం తెలిపారు. ఈ నెల 11, 12, 13 వ తేదీల్లో శిక్షణా తరగతులను టౌన్ చర్చిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులు బైబిల్‌శిక్షణా తరగతులకు హాజరయ్యేలా తల్లితండ్రులు చూడాలన్నారు.

హద్దులులేని సాయం.. నిలుపుతోంది ప్రాణం

- ఆపద సమయంలో ఆపద్బాంధవుడిలా సేవలందిస్తున్న 108
- జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటి సేవలు
- పలు సందర్భాల్లో గర్భిణులకు వాహనంలోనే ప్రసవాలు
- నాలుగేళ్లలో 16 వేల మందికి వైద్యసాయం



శ్రీశైలం: రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖరెడ్డి ప్రవేశపెట్టిన 108 వాహనాలు బాధితులకు అనేకరకాలుగా సేవలను అందిస్తూ వస్తున్నాయి. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 2019 నుంచి 108 వాహనాల్లో అత్యాధునిక వైద్య పరికాలను ఏర్పాటు చేసి, బాధితుల ప్రాణాలు కాపాడేందుకు సకల చర్యలు తీసుకున్నారు. శ్రీశైలం మండలంలో 108 సిబ్బంది సకాలంలో స్పందిస్తూ.. ప్రజల ప్రాణాలు కాపాడుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

పరిధి దాటి సేవలు

శ్రీశైలం మండల వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందిస్తూ క్షతగాత్రులను ప్రాజెక్ట్ వైద్యశాలకు తరలించడంలో 108 వాహనం కీలక పాత్ర పోషిస్తోంది. తమ పరిధి కానప్పటికి ప్రకాశం జిల్లాలో, తెలంగాణ, ఆంధ్ర సరిహద్దు ప్రాంతం దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాద ఘటనల్లో సుమారు 2,500 మందికి పైగా బాధితులు 108 ద్వారా సత్వర వైద్యసేవలు అందుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 108 వాహనం నిర్వహణ కోసం ఎమర్జన్సీ మెయింటెనెన్స్ టెక్నీషియన్లు ఇద్దరు, మరో ఇద్దరు డ్రైవర్లను పైలెట్స్‌గా నియమించారు. 24 గంటలు, 365 రోజులు అప్రమత్తంగా ఉండి, వైద్య చికిత్సలు అందించడానికి సన్నద్ధంగా ఉంటారు. 2019 నుంచి నేటి వరకు మండల వ్యాప్తంగా దాదాపు 16 వేల కేసుల వరకు 108 వాహనం సేవలందించింది.



బాలింతలకు బాసట

2019 నుంచి ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 108 ద్వారా 7800లకు పైగా కేసులను అటెంప్ట్ చేసినట్లు టెక్నీషియన్ మురళి తెలిపారు. ఇందులో 2400 లకు పైగా కేసులు అత్యవసర కేసులు ఉన్నాయి. దేవస్థానం పీహెచ్‌సీ కేంద్రంలో 700 లకు పైగా ప్రసవాలు జరగగా 108 వాహనం వల్ల సకాలంలో వైద్యశాలకు చేర్చడంతో సాధారణ కాన్పులు ఎక్కువగా జరిగాయి. కొన్ని సార్లు అంబులెన్స్‌లోనే సుఖప్రసవాలు చేశారు.

ఆశావర్కర్లు, 108 వాహనం వల్ల సుఖప్రసవం



గతేడాది అక్టోబర్ నెలలో గర్భిణిగా ఉన్న నాకు హఠాత్తుగా నొప్పులు వచ్చాయి. విషయాన్ని సంబంధిత ప్రాంతానికి చెందిన ఆశావర్కర్ ఎస్టేర్‌రాణికి తెలియజేశాను. 108 వాహనం వచ్చి నన్ను మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో సిజేరియన్ జరగాల్సిన పరిస్థితిలో నార్మల్ డెలివరీ జరిగింది. దీంతో ఎంతో సంతోషపడ్డాను. వెంటనే స్పందించిన ఆశావర్కర్, 108 సిబ్బందికి కృతజ్ఞతలు.

– డి.భారతి, ఎస్టీకాలనీ, శ్రీశైలం

ఫోన్ వచ్చినవెంటనే అందరినీ అప్రమత్తం చేస్తాం



మండల వ్యాప్తంగా ఉన్న ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఇవ్వడంతో పాటు ప్రతి నెలా వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ చెకప్‌ల ద్వారా తెలుసుకుంటుంటాం. పగలైనా, అర్ధరాత్రైనా బాధితుల నుంచి ఫోన్‌కాల్ వస్తే వెంటనే స్పందించి 108తో పాటు పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లను అప్రమత్తం చేస్తాం. వీలైనంత వరకు క్షతగాత్రులకు శారీరక, మానసిక అనారోగ్యాలు అయిన వారికి అంబులెన్స్‌లో ప్రాథమిక చికిత్స నిర్వహిస్తాం.

–ఎస్తేరురాణి, ఆశావర్కరు

ప్రతి క్షణం అమూల్యమైనది



బాధితులను అంబులెన్స్ ఎక్కించినప్పటి నుంచి ఆసుపత్రికి చేర్చేంత వరకు నాకు, టెక్నీషియన్‌కు ప్రతిక్షణం అమూల్యమైనదే. శ్రీశైల నుంచి 10 కిమీ దూరం దాటితే ప్రకాశం జిల్లా పరిధి వస్తుంది. మరో 16 కిమీ దాటితే తెలంగాణ రాష్ట్ర సరిహద్దు వస్తుంది. అయినప్పటికీ సరిహద్దులు దాటి ఇతర రాష్ట్రాల్లోకి కూడా ప్రవేశించి అత్యవసర వైద్య సేవ, చికిత్సలను అందిస్తున్నాం. 2019 నుంచి ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా, పరిసర ప్రాంతాల్లో సుమారు 50 వేల కి.మీ 108 వాహనం ప్రయాణించి అనేక మంది బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చింది.

– ఎమ్‌డి వలి, 108 పైలెట్, శ్రీశైలం

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

పగిడ్యాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా సాగింది. 1995–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులును శాలువాలు కప్పి పూలమాలలతో మెమొంటోలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు, క్రీడాశ్రీ పీతాంబర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామానా ధార్మిక వ్యాప్తికి కృషి

వెలుగోడు: గ్రామ గ్రామానా ధార్మిక వ్యాప్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అంకాల పరమేశ్వరి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ధార్మిక వ్యాప్తిలో భాగంగా గ్రామాల్లో మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం అమ్మవారికి గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు డి.వెంకటేశ్వర్లుచే శ్రీమద్రామాయణం పై ప్రవచనం, భజన కార్యక్రమాలు జరిగాయని చెప్పారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.11.43లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన షేక్ హమీద్, మల్యాలకు చెందిన నక్కల నారాయణ, కొత్తపల్లి మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన తెలుగు లక్ష్మిదేవి, పగిడ్యాల మండలంలోని ప్రాతకోట గ్రామానికి చెందిన అంబటి రామసుబ్బారెడ్డి, పాములపాడు మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన బోయ సరస్వతి, ఇస్కాల గ్రామానికి చెందిన మేకల శేషన్న, జూపాడుబంగ్లా మండలంలోని మండ్లెం గ్రామానికి చెందిన గొల్ల మద్దమ్మలకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలరు ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముడియాల రమణారెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పేదల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

ఆత్మకూరు: రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియమారూఫ్ అన్నారు. పట్టణంలోని కొత్తపేట సచివాలయ పరిధిలో ఉర్దూ పాఠశాల వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్–2 కార్యక్రమం నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ రామకృష్ణ, కో ఆప్షన్‌సభ్యులు రషీద్ పాల్గొన్నారు.

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ షైనీ ప్రియాంక, శ్వేత, రాజశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వీఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో 2వ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు.



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రాధాన్యత
- రూ. కోటితో బండిఆత్మకూరు వీవర్స్ కాలనీ డ్రైనేజీ సమస్య పరిష్కారం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం



బండిఆత్మకూరులో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా

మహానంది: అన్ని వర్గాల వారి సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మానందరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు మండలం ఏ కోడూరు, బండిఆత్మకూరు గ్రామాల్లో బుధవారం రైతు భరోసా కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్, హెల్త్ క్లినిక్, కొత్తకొట్టాలలో డ్రైనేజీ పనులు, సీసీ రోడ్లను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రూ. కోట్లు వెచ్చించి గ్రామాల్లో అత్యంత అధునాతనమైన భవనాలు నిర్మించడమే కాకుండా అన్ని వర్గాల వారికి అవసరమైన సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉంచుతూ నిజమైన గ్రామ స్వరాజ్యపాలన అందిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రతి పక్షనేతలకు కనపడటం లేదని, ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు.

ఏళ్ల నాటి సమస్యలకు పరిష్కారం

బండిత్మకూరులో ఏళ్ల తరబడి నెలకొన్న డ్రైనేజీ సమస్యను రూ. కోటితో పనులు చేయించి తీర్చినట్లు చెప్పారు. సచివాలయాల వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు ద్వారా గ్రామస్థాయిలోనే సుపరిపాలన అందుతుందన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాస రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి, ఎస్డీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి, కోడూరు సర్పంచ్ జ్ఞానాభరణం, బండిఆత్మకూరు సర్పంచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించండి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రాన్ని సందర్శించే భక్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఏపీలెజిస్లేటివ్ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్ పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే ఎల్‌వీవీ కళావతి దేవస్థానం అధికారులను ఆదేశించారు. బుధవారం శ్రీశైలం చేరుకున్న ఆమెకు భ్రమరాంబా అతిథి గృహం వద్ద దేవస్థానం ఈఓ డి పెద్దిరాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె దేవస్థాన ఈఓ, పలు విభాగాల అధికారులతో దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, క్షేత్రంలో చేపట్టబడిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు వసతి, సౌకర్యవంతమైన దర్శనం తదితర ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. భక్తులరద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు ఏర్పాట్లును చేస్తూ ఉండాలన్నారు. అనంతరం భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్నారు. అసెంబ్లీ సెక్రటరీ వి.భిక్షం, సెక్షన్ ఆఫీసర్ కాశీరెడ్డి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉమేష్‌చంద్ర, అలాగే దేవస్థాన సహాయ కమిషనర్ హెచ్‌జీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న అంచనాల కమిటీ చైర్‌పర్సన్ కళావతి

కేపీఎల్‌కు విశేష స్పందన

మహానంది: కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలకు విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్పా కార్తీక్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని జెడ్పీ పాఠశాల మైదానంలో బుధవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఆయన క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం శిల్పా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కుంచపు శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కేపీఎల్ ప్రారంభం

వెలుగోడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ పోటీలను శిల్పా కార్తీక్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని సరదాగా కాసేపు క్రికెట్ ఆడా రు. కార్యక్రమంలో అంబాల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని సిద్దాపురం గ్రామంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ పోటీలను బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి పరిశీలించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయి ఆడుదాం-ఆంధ్ర క్రీడలు



నందికొట్కూరు మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఆత్మకూరు జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్



వెలుగోడులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ లాలం రమేష్

నందికొట్కూరు: క్రీడలలో రాణిస్తే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శోభరాణి అన్నారు. బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సంజన్న, వ్యాయామ ఉపాధ్యాయులు డోరతి, జెసింత, పద్మలత, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆత్మకూరు: క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ జానకీరాం, పీఆర్ ఏఈ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: మండల స్థాయి' ఆడుదాం – ఆంధ్ర ఆటల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ లాలం రమేష్ ఈ పోటీలను ప్రారంభించారు. సర్పంచులు వేల్పుల జయపాల్, సర్దార్‌మియా, ఎంపీడీఓ షేక్ అమానుల్లా పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఎంపీడీవో శోభారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సంజన్న, శాప్ కోఆర్డినేటర్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల పరిచయ వేదిక

కొత్తపల్లి: ఉత్తమ క్రీడాకారులను పరిచయం చేసే వేదిక ఆడుదాం ఆంధ్ర అని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మేరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడాపోటీలను సర్పంచు లక్ష్మీదేవి అధ్యక్షతన ప్రారంభించారు. కార్యక్రమంలో కో ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నాగ ఎల్లయ్య, ఎంపీటీసీలు ప్రవంతి, ముబీనా బేగం, గుమ్మడాపురం సర్పంచు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూలు క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ గోపీక్రిష్ణ, తహసీల్దార్ రత్న రాధిక, ఎంఈఓ బాలాజీనాయక్, ఎస్ఐ అశోక్‌లు జాతీయజెండాను ఆవిష్కరించి, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించి, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రావు, రాజశేఖర్, నాగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభమైన ఆడుదాం.. ఆంధ్రా క్రీడాపోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలను మండల ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం సాగిన పగిడ్యాల–3,. లక్ష్మాపురం–3 సచివాలయ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ఆసక్తికరంగా సాగింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన పగిడ్యాల–3 సచివాలయ జట్టు పది ఓవర్లలో 120 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభుతేజ అలరించే షాట్లతో 51 పరుగులు సాధించి ప్రేక్షకలకు కనువిందు చేశాడు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఖోఖో అసోషియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సర్పంచ్ మొట్టెబాలస్వామి అధ్యక్షతన ఆడుదాం–ఆంధ్ర మండలస్థాయి క్రీడాపోటీల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ నూర్జహాన్, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: క్రీడా మైదానంలో ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి ప్రారంభించారు. మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, ఎంఈఓ శ్రీనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాక్షిగణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతో, ఫలోదకాలతో, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామి వారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని రైతులు ప్రభుత్వం నిర్వహించే పొలంబడి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ బీటీఎం చక్రవర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలోని శనగ పంటలో క్షేత్ర ప్రయోగాలు నిర్వహించారు. వీఏఏ శాంతిరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆత్మకూరు ఏపీఎస్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మహేంద్రుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు మూడు ప్రత్యేక బస్సులు నడుపుతామని చెప్పారు. ఆత్మకూరు–కర్నూలు, ఆత్మకూరు–నంద్యాల రూట్లలో ప్రయాణికులకు తగ్గట్లు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.